క్లుప్తంగా

నగర పంచాయతీ కార్మికుల ధర్నా



తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. పన్నెండో పీఆర్సీని ప్రకటించి మున్సిపల్ కార్మికులందరికీ పెంచిన జీతాలు చెల్లించాలని, గతంలో కార్మికులు సమ్మె చేసినపుడు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు బలగాని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

నూజివీడు: రిజిస్ట్రేషన్ శాఖలో ఓటీపీ నూతన విధానానికి చరమగీతం పాడి దస్తావేజు లేఖరులకు లైసెన్సులు మంజూరు చేయాలని దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు అలీ అబ్బాస్ డిమాండ్ చేశారు. నూజివీడు పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో దస్తావేజు లేఖరులు పెన్ డౌన్ కార్యక్రమంతో నిరసన తెలిపారు. దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు అలీ అబ్బాస్ మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని నమ్ముకుని దస్తావేజు లేఖరులుగా జీవిస్తున్నామని చెప్పారు. దస్తావేజు లేఖరుల ఉపాధిని మెరుగుపరుస్తూ ప్రభుత్వం పర్మినెంట్ లైసెన్సులు మంజూరు చేయాలని కోరారు.

క్రీడాకారిణుల ఆందోళన



నూజివీడు: పట్టణానికి చెందిన బాస్కెట్‌బాల్ క్రీడాకారిణులు శుక్రవారం రాత్రి స్థానిక విక్టోరియా టౌన్‌హాల్ బాస్కెట్ బాల్ కోర్టులో ఆందోళనకు దిగారు. శాప్ తమకు తీవ్ర అన్యాయం చేసిందని, తాము నేషనల్ జూనియర్, సీనియర్ పోటీల్లో ఒక్కొక్కరు 5 నుంచి 11 సార్లు పాల్గొన్నా ట్రిపుల్‌ఐటీలో సీటు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు తమ ఆందోళనను విరమించేది లేదని స్పష్టం చేశారు. బేతాళ ప్రభుదీపిక జూనియర్, సీనియర్ విభాగాల్లో జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించింది. షేక్ అఫ్రా ఆరు సార్లు, బుర్రె ప్రణవి 4 సార్లు బాస్కెట్ బాల్ జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 20న నిర్వహించే కౌన్సెలింగ్‌ను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. శాప్ నిర్వహించిన ఎంపికలో ఏమాత్రం పారదర్శకత లేదని, పేద కుటుంబాలకు చెందిన మేము శాప్ అధికారులను ఎలా కలవగలమని వాపోయారు. బాస్కెట్‌బాల్ కోచ్ వాకా నాగరాజు, క్రీడాకారిణుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

తిరువూరు: సమస్యల పరిష్కారం కోరుతూ తిరువూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం గ్రామ రెవెన్యూ సహాయకులు ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం మాదిరిగా వేతనాలివ్వాలని, అటెండర్లకు నైట్ వాచ్‌మెన్ విధులు నిర్వహించాలనే నిబంధన ఎత్తివేయాలని, గ్రామ సహాయకులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తిరువూరు మండల వీఆర్ఏల అసోసియేషన్ నాయకులు వంగూరు శేషయ్య, రాధమ్మ, జమలమ్మ పాల్గొన్నారు.

వేతన సంఘాన్ని నియమించాలి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే ఉద్యోగులకు ఎనిమిదో వేతన సంఘాన్ని వెంటనే నియమించాలని మజ్దూర్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి ఎంవీఎం నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ పిలుపు మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు శుక్రవారం ప్రధాన గేటు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. వేతన సంఘం అమలులో జాప్యాన్ని తీవ్రంగా ఖండించారు. బ్రాంచ్ చైర్మన్ తమ్మా సుబ్బారెడ్డి, ట్రెజరర్ ఓ.సురేష్, అసిస్టెంట్ డివిజన్ సెక్రటరీ ఓ.రామయ్య, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఏడుగురు ఎంపిక

విస్సన్నపేట: హైదరాబాద్‌కు చెందిన దివిస్ ల్యాబ్ ఆధ్వర్యంలో స్థానిక సిద్దార్థ (విజ్ఞాన్) డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. 70 మంది విద్యార్థులు హాజరు కాగా ఏడుగురు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని కళాశాల చైర్మన్ మేడా మోహనరావు, ప్రిన్సిపాల్ టి. సత్యనారాయణ, కరస్పాండెంట్ ఎం. సత్యనారాయణ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఆగిరిపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో-1 హేబేలు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈఓలు హేబేలు, ఆనంద్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. వాలీబాల్ బాయ్స్ అండర్-17 విభాగంలో ఈదర జెడ్పీ హైస్కూల్ ప్రథమ, ఆగిరిపల్లి జెడ్పీ పాఠశాల ద్వితీయ స్థానం సాధించింది. అండర్-14 కబడ్డీ బాలుర విభాగంలో ఆగిరిపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు విజయం సాధించారు. బాలిక కబడ్డీ పోటీల్లో ఈదులగూడెంకు చెందిన విద్యార్థులు గెలుపొందారు.

వర్షాకాలం.. నరకప్రాయం

- చినుకుపడితే బురదగా మారుతున్న రహదారి
- సాగు భూములకు వెళ్లేందుకు రైతుల ఇబ్బందులు
- రెండు మండలాల రెవెన్యూ పరిధికి బోర్డర్‌గా ఉన్న రహదారి
- రహదారి అభివృద్ధి కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు



బురదగా మారిన కొత్త మంగాపురం గ్రామం నుంచి వ్యవసాయ భూములకు వెళ్లే రహదారి

కొత్త మంగాపురం(జి.కొండూరు): మైలవరం మండల పరిధి కొత్త మంగాపురం గ్రామం నుంచి వ్యవసాయ భూములకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడి రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంతో చినుకుపడితే బురదగా మారుతోంది. సాగు భూముల్లోకి వెళ్లేందుకు రైతులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. ఈ రహదారి ఇటు మైలవరం, అటు రెడ్డిగూడెం రెవెన్యూ పరిధికి మధ్యలో ఉంది. ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు రెండు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుకు రావడం లేదు. ఈ రహదారిని ఆనుకొని వ్యవసాయ భూములు ఉన్న రైతులకు కష్టాలు తప్పడంలేదు.

400 ఎకరాలకు పైగా..

కొత్తమంగాపురం నుంచి రెడ్డిగూడెం మండల పరిధి ఓబులాపురం గ్రామం వరకు మూడు కిలోమీటర్ల మేర ఈ రహదారి ఉంది. ఈ రహదారికి కుడి వైపున ఉన్న వ్యవసాయ భూములు మైలవరం రెవెన్యూ పరిధిలో, ఎడమ వైపున ఉన్న వ్యవసాయ భూములు రెడ్డిగూడెం రెవెన్యూ పరిధిలో ఉన్నాయి. ఈ రహదారిని ఆనుకుని మొత్తం 400 ఎకరాల వరకు సాగు భూమి ఉంది. ఇక్కడ పత్తి, మొక్కజొన్న, వరి, మిరప, పండ్ల తోటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తుంటారు. వర్షాకాలం వస్తే రైతులు తమ సాగు భూములలోకి వెళ్లేందుకు నరకయాతన పడుతున్నారు. రహదారి మొత్తం బురదమయం కావడంతో నడిచి వెళ్లాల్సి రావడంతో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులు, కూలీలను తరలించడం కష్టంగా మారుతోంది. ట్రాక్టరు ఉంటే తప్ప ఈ రహదారిలో రాకపోకలు సాగించలేని పరిస్థితి. వేసవిలో ఈ రహదారిని ఆనుకొని ఉన్న కాల్వల్లో ఉపాధి హామీ కూలీలు పూడిక తీసిన మట్టిని రహదారిపై వేయడంతో వర్షం పడినప్పుడు బురదగా మారి సమస్య తీవ్రమవుతోంది.

అభివృద్ధి చేస్తే మేలు

ఈ రహదారి వ్యవసాయ భూములకు వెళ్లేందుకే కాకుండా రహదారిని అభివృద్ధి చేస్తే కొత్త మంగాపురం నుంచి రెడ్డిగూడెం వెళ్లే వాహన చోదకులు ఈ రహదారి నుంచి ఓబులాపురం గ్రామం మీదుగా రెడ్డిగూడెం వెళ్లేందుకు షార్ట్‌కట్‌గా ఉంటుంది. అయితే ఈ రహదారి రెండు మండలాలకు బోర్డర్‌లో ఉండడంతో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఒకసారి ఈ రహదారి అభివృద్ధికి నిధులు మంజూరైనప్పటికి రెండు మండలాల ప్రజాప్రతినిధులు తామంటే తామే పనులు చేయాలని పోటీపడి ఎవరూ చేయకుండా వదిలేశారని రైతులు విమర్శిస్తున్నారు.

రహదారిని అభివృద్ధి చేయాలి



మా ఊర్లో నుంచి చేలల్లోకి వెళ్లాలంటే నరకయాతన పడుతున్నాం. వర్షం పడినప్పుడల్లా రోడ్డు మొత్తం రొచ్చులా మారి అడుగుతీసి అడుగువేయలేకపోతున్నాం. ట్రాక్టరు ఉంటే తప్ప చేల్లలోకి వెళ్లడం కష్టంగా ఉంటుంది. లేదంటే నడిచి వెళ్లాల్సి వస్తుంది. రోడ్డును వెంటనే బాగు చేయాలి.

– వేమిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, రైతు, కొత్త మంగాపురం

నరకయాతన పడుతున్నాం



నాకు మా గ్రామ శివారులో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. చేలోకి వెళ్లేందుకు రోడ్డు బాగోలేక నరకయాతన పడుతున్నాం. ప్రతి రోజూ నడిచి వెళ్లాల్సి వస్తోంది. ఎరువుల బస్తాలు తీసుకెళ్లాలంటే ట్రాక్టరు ఉంటేనే సాధ్యమవుతుంది. రోడ్డు మొత్తం బురదమయం కావడంతో కూలీలు కూడా పనులకు రావాలంటే భయపడుతున్నారు.

– శీలం శివలింగారెడ్డి, రైతు, కొత్త మంగాపురం

అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నాం



నాకు మా గ్రామ శివారులో ఐదు ఎకరాల సాగు భూమి ఉంది. ప్రతి రోజు చేలోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. రోడ్డంతా బురదమయం కావడంతో జారి పడిపోతున్నాం. నడిచి వెళ్లాలంటేను కష్టంగా ఉంది. ట్రాక్టరు ఉంటేనే ఎరువుల బస్తాలు తీసుకెళ్లడానికి వీలవుతుంది. అధికారులు వెంటనే స్పందించి రోడ్డును బాగు చేయాలి.

– వేమిరెడ్డి రామసుబ్బారెడ్డి, రైతు, కొత్త మంగాపురం

మత్తు పదార్థాలతో అనర్థాలపై అవగాహన

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా ఫార్మసీ కళాశాలలో మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈగల్ టీమ్ సీఐ ఎం.రవీంద్ర మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు భవిష్యత్‌లో ఫార్మసీ లలో ఉద్యోగం చేసే సమయంలో ప్రిస్క్రిప్షన్ లేకుండా డ్రగ్స్ విక్రయించకూడదన్నారు. డ్రగ్స్ తయారీ కంపెనీల్లో పనిచేసేటప్పుడు సింథటిక్ డ్రగ్స్ గురించి మీ దృష్టికి వస్తే ఈగల్ చీఫ్ సెంటర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. డ్రగ్స్ అలవాటు చేసుకుంటే జీవితం శూన్యమన్నారు. ఆపరేషన్ ఈగల్ గురించి వివరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఎస్ఐలు వీరాంజనేయులు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రచయితలకు నివాళి

తిరువూరు: ప్రముఖ రచయితలు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు తాపీ ధర్మారావు, బోయ భీమన్న జయంతి కార్యక్రమాన్ని గంపలగూడెం మండలం పెనుగొలనులో శుక్రవారం నిర్వహించారు. షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇరువురు రచయితల చిత్రపటాలకు కమిటీ అధ్యక్షుడు ఊటుకూరు నారాయణరావు, సభ్యులు ఇలాసాగరపు నాగమణి, రాధమ్మ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఇరువురు రచయితల జీవిత విశేషాలను వక్తలు విద్యార్థులకు వివరించారు.

రేపు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమావేశం

తిరువూరు: వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం మధ్యాహ్నం తిరువూరులో జరుగుతుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఒక ప్రకటనలో తెలిపారు. తిరువూరు తోకపల్లి రోడ్డులోని సూర్య ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశంలో వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఆకువాని చెరువు కట్టకు గండి

- 30వ నంబర్ హైవేపై ప్రవహించిన నీరు
- శాంతినగర్, ఇందిరమ్మ కాలనీ రోడ్లపైకి చేరిన నీరు
- ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన



కొండపల్లిలో ఆకువాని చెరువు కట్ట తెగడంతో రోడ్డుపై ప్రవహిస్తున్న చెరువు నీరు



ఇందిరమ్మ కాలనీ వాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో గురువారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి ఆకువాని చెరువు కట్టకు గండి పడింది. అధిక వర్షానికి కొండ ప్రాంతాల నుంచి చెరువులోకి అధికంగా చేరిన వర్షం నీటితో కట్ట తెగినట్లు భావిస్తున్నారు. చెరువు నీటితో కొండపల్లి శాంతినగర్, ఇందిరమ్మ కాలనీ, మోహనరావు నగర్‌లోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 30వ నంబర్ జాతీయ రహదారిపై భారీగా చెరువు నీరు చేరడంతో శుక్రవారం ఇబ్రహీంపట్నం నుంచి మైలవరం వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. హైవే సిబ్బంది వన్‌వే ఏర్పాటు చేసి రాకపోకలను పునరుద్ధరించారు.

కాలనీ వాసుల భయాందోళన

శాంతినగర్, ఇందిరమ్మ కాలనీ, మోహనరావు నగర్ ప్రజలు చెరువు నీటితో భయభ్రాంతులకు గురయ్యారు. చెరువు నీటితో ఎవరికీ ఎటువంటి నష్టం జరగనప్పటికీ గత ఏడాది సెప్టెంబర్‌లో బుడమేరు కట్ట తెగడంతో కాలనీల్లోకి చేరిన వరద నీటిని గుర్తుకు తెచ్చుకుని నిద్రలేని రాత్రిని గడిపారు. గతంలో కూడా ఆకువాని చెరువు కట్ట తెగి ఆయా కాలనీల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురైన సందర్భాలు ఉన్నాయి. మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, మున్సిపల్ కమిషనర్ మౌస్మి గనియా నీటి ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించి నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేశారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలేవి?

గత ఏడాది వరదల సమయంలో కట్ట తెగడంతో చెరువులో ఆక్రమణల తొలగింపు అంశం తెరపైకి వచ్చింది. ఏడాది కాలం గడిచినా ఇప్పటికీ ఆక్రమణల తొలగింపుపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం వల్లే కొద్దిపాటి వర్షానికి కూడా ఆకువాని చెరువు కట్ట తెగిపోతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెరువులో ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

మహిళల ఆరోగ్యంతో మంచి సమాజం



పొందుగలలో గర్భిణులకు పౌష్టికాహార బ్యాగ్‌లు అందజేస్తున్న డాక్టర్ అరుణ

మైలవరం: మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని చంద్రాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అరుణ అన్నారు. మైలవరం మండలం పొందుగల గ్రామంలో సర్పంచ్ గుగులోతు కోటమ్మ అధ్యక్షతన స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. డాక్టర్ అరుణ మాట్లాడుతూ మహిళలు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భాశయ ముఖద్వారా స్క్రీనింగ్ చేయించుకోవాలన్నారు. సర్పంచ్ కోటమ్మ, గ్రామ పెద్ద బూదేటి రామారావు, గుగులోతు రాంబాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రియదర్శిని, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

- **రెడ్డిగూడెం(జి.కొండూరు):** రెడ్డిగూడెం మండలంలోని కూనపరాజుపర్వలో స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు వైద్య పరీక్షలు చేశారు. 182 మందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామని వైద్యాధికారులు తెలిపారు. సర్పంచ్ మాతంగి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- **చాట్రాయి:** మహిళలు ఆరోగ్యంగా ఉండాలని చాట్రాయి పీహెచ్‌సీ వైద్యాధికారి అన్నారు. చాట్రాయి పీహెచ్‌సీలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. మహిళలకు బీపీ, షుగర్, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు దుర్గా ప్రసాదు, శ్రీనివాసరెడ్డి తదిరులు పాల్గొన్నారు.
- **కొర్లమంద(విస్సన్నపేట):** మండలంలోని కొర్లమంద గ్రామంలో స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ కె. శ్రీనివాసరావు, డాక్టర్ అశ్వినీదత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- **ముసునూరు:** మహిళల ఆరోగ్యమే కుటుంబానికి మహాభాగ్యమని నూజివీడు డెప్యూటీ డీఎంహెచ్ఓ జగన్‌మోహన్ అన్నారు. స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షకీనా ఇవాంజిలిన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాట్రేనిపాడులో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. పోషకాహార ప్రదర్శన ఆకట్టుకుంది. ఎంపీ హెచ్ఈఓ మురళీమోహన్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ ధ్వజం
- సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ, ధర్నా



నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

నూజివీడు: విద్యార్థుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్ ధ్వజమెత్తారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం పట్టణంలో ర్యాలీ, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నారా లోకేష్ అధికారం చేపట్టిన తరువాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. వైద్య కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. పేద, బలహీన వర్గాల ప్రజలకు వైద్య విద్యకు దూరం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. రూ.6 వేల కోట్లతో వైద్య కళాశాలలకు బిల్డింగ్‌లను కట్టలేనప్పుడు లక్ష కోట్లతో రాజధానిని ఎలా నిర్మిస్తారని నిలదీశారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 3,500లకు పైగా ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేస్తామని యువగళం పాదయాత్రలో ప్రకటించిన ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నేడు దాని గురించి ఎక్కడా మాట్లాడటం లేదన్నారు. జిల్లా కోశాధికారి ఎం.క్రాంతికుమార్, నాయకులు సాయి ప్రసాద్, గోపి, సంతోష్, గణేష్, విష్ణు, చరణ్, శివశంకర్, రవి, హర్షవర్దన్, జస్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

సీడీపీఓ పుష్పలత

మైలవరం: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ మైలవరం ప్రాజెక్టు సీడీపీఓ కె. పుష్పలత అన్నారు. మైలవరంలోని మసీదు వీధిలో సూపర్‌వైజర్ జె. కటాక్షం ఆధ్వర్యంలో జాతీయ పౌష్టికాహార మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధి కె.శిరీష మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తల్లులకు వంటల పోటీలు నిర్వహించారు. విజయ వాహినీ చారిటబుల్ ఫౌండేషన్ సిబ్బంది, ఎంఈఓ ఎల్. బాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

మైలవరం: ఇంజినీర్స్‌డే సందర్భంగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన 19వ నేషనల్ లెవెల్ సింపోసియమ్‌లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థి గోగినేని పవనేశ్ బృందం ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి, రూ.40 వేల నగదు బహుమతిని గెలుచుకున్నారు. విద్యార్థి బృందాన్ని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్. నాగార్జునరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందాలి

ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

జి.కొండూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవడం వల్ల భవిష్యత్‌కు బంగారు బాట పడుతుందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో క్రీడాకారుల ఎంపిక పోటీలను స్థానిక శాగం శివరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శినితో కలిసి పోటీలను ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ పోటీల ఇన్‌చార్జ్ పీడీ పురుషోత్తం మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలకు అండర్-14, 17 బాలుర విభాగాలలో 180 మంది క్రీడాకారులు పోటీ పడగా 58 మందిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశామని చెప్పారు. బాలికల విభాగంలో ఎంపిక పోటీలను శనివారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎం.వీరాస్వామి, పాఠశాల హెచ్ఎం శ్రీలత పాల్గొన్నారు.

- **నరసాపురం(విస్సన్నపేట):** క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు అన్నారు. మండలంలోని నరసాపురం జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి ఆటల పోటీలను ఎంపీడీఓ శుక్రవారం ప్రారంభించారు. ఎంఈఓ సుధాకర్, పాఠశాల హెచ్ఎం శోభాలత, డివిజన్ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎం. రమేష్ పాల్గొన్నారు.

నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి

నూజివీడు: చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు నూజివీడును తప్పనిసరిగా ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు తమ పోరాటం ఆపేది లేదని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఇందుపల్లి సత్యప్రకాష్ అన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేసేందుకు నూజివీడు కోర్టు నుంచి ర్యాలీగా బయలు దేరిన న్యాయవాదులను బస్టాండ్ వద్ద పట్టణ సీఐ పి.సత్యశ్రీనివాస్ అడ్డుకున్నారు. మంత్రి కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేసేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. దీంతో న్యాయవాదులు కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించారు. అనంతరం స్థానిక చిన్నగాంధీబొమ్మ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నం రమేష్, సెక్రటరీ వై.హరిబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షణ సైన్యం ఆవిర్భావ దినోత్సవం

ముసునూరు: ప్రజలను ప్రేమ, శాంతి, రక్షణ మార్గాల్లో నడిపేందుకే రక్షణ సైన్యం భారతదేశంలో ఆవిర్భవించిందని సంఘ ఉప మండల అధికారి మేజర్ పి.జయకర్ అన్నారు. ముసునూరులోని రక్షణ సైన్యం చర్చి వద్ద శుక్రవారం సంస్థ 143వ భారత దేశ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వాసులకు శాంతి, రక్షణ సందేశాన్ని అందించి, చర్చి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఉప మండల సంఘాల మహిళా కన్వీనర్ పి.దేవకాంతమ్మ, స్థానిక సంఘ పాస్టర్ కెప్టెన్ ఇజ్రాయేల్, కెప్టెన్ పుణ్యవతి, ఆయా చర్చిల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

పగిలిన గణపవరం చెరువు షట్టర్ తూము

బీసీ కాలనీలోకి ప్రవేశించిన నీరు

మైలవరం: మైలవరం మండలం గణపవరం చెరువు తూము షట్టర్ గురువారం రాత్రి పగిలి నీరు సమీపంలోని బీసీ కాలనీలోకి చేరింది. దీంతో కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీస్, రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని తాత్కాలికంగా ఇసుక బస్తాలను తూముకు అడ్డుగా వేశారు. పగిలిపోయిన షట్టర్ స్థానంలో ఇనుప రేకును ఏర్పాటు చేయించారు. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. దీనితో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

చాట్రాయి: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చాట్రాయి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులు ప్రణాళికలు వేసుకోవాలన్నారు. వేప కషాయం, నీమాస్త్రం, జీవామృతం వంటి జీవపోషకాలను వినియోగించాలని సూచించారు.

వ్యాన్ ఢీకొని ఇద్దరికి గాయాలు

నూజివీడు: మండలంలోని మీర్జాపురంలో శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని వ్యాన్ ఢీకొన్న ఘటనలో గొల్లపల్లికి చెందిన ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లికి చెందిన తోట శ్రీను (25), కందుల బాలాజీ (25) బైక్‌పై రాత్రి 8 గంటల సమయంలో గొల్లపల్లి వస్తుండగా వారికి ఎదురుగా హనుమాన్ జంక్షన్ వైపు వెళుతున్న వ్యాన్ మీర్జాపురం సెంటర్‌లో ఢీకొట్టింది. తోట శ్రీనుకు కాలు విరగడంతో పాటు తలకు గాయమైంది. కందుల బాలాజీకి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన తోట శ్రీనును మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. బైక్‌ను ఢీకొన్న వెంటనే డ్రైవర్ వ్యాన్‌ను ఆపకుండా వెళ్లిపోయాడు. పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు.